క్లుప్తంగా

సత్యసాయి మందిరంలో సాయి నామ సంకీర్తన


సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా చినముషిడివాడలోని సత్యసాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో 24 గంటల నిర్విరామ నామ సంకీర్తన కార్యక్రమం ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. ముందుగా సత్యసాయికి విశేష పూజలు జరిపారు. సత్యసాయి సేవా సంస్థలు, భక్త బృందం, అనుబంధ బృందాల ప్రతినిధులు రాఘవరావు, బి.ఆర్.ఎస్.ఎస్.నాయుడు, ఆర్.ఎ.నాయుడు, రమేష్, సతీష్‌కుమార్, అక్కునాయుడు, సన్యాసిరావు, గౌరినాయుడు, చలపతిరావు, సాయికుమారి, దాదాపు 400 మంది సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు పందిరి రాట


పందిరిరాట వేస్తున్న గంట్ల శ్రీనుబాబు తదితరులు

సింహాచలం: అడవివరంలోని అయిల్‌మిల్ వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగే వినాయక చవితి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గడిచిన 42 ఏళ్లుగా వినాయకచవితి ఉత్సవాలను నిర్విరామంగా చేస్తున్నామని, ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు గంట్ల తమ్మయ్య, విగ్రహదాత కె.వి.నరసింహం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తత్కాల్ టికెట్‌కు ఒక రోజు ముందే పేరు నమోదు

మరుసటిరోజు క్యూలో ఉంటే చాలు


దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో తత్కాల్ టికెట్ విధానాన్ని సులభతరం చేశారు. టికెట్ తీసుకోవాల్సిన ప్రయాణికులు ముందురోజు రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన పత్రంపై పేరు, సీరియల్ నంబర్, ఆధార్ నంబర్ రాసి తర్వాత రోజు టికెట్ కోసం క్యూలో ఉంటే సరిపోతుంది. ఈ విధానం దువ్వాడ రైల్వేస్టేషన్ అధికారులు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే తత్కాల్ టికెట్లను ముందు రోజు జారీ చేస్తారు. వాటి కోసం అదేరోజు తెల్లవారు జాము నుంచి ప్రయాణికులు స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తుంటారు. దీంతో ప్రయాణికులు తోపులాటకు దిగుతుండడంతో దువ్వాడ రైల్వే కమర్షియల్ అధికారి ఎం.ఎస్.రావు చొరవ తీసుకొని ముందురోజు రాత్రి 9.30 పది గంటల మధ్యలో అధికారికంగా ఒక పేపర్ ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై పేర్లు, ఆధార్ నంబర్ రాసి పెట్టి మరుసటిరోజు ఉదయం కౌంటర్ తెరవకముందు వస్తే సీరియల్ నంబర్ ప్రకారం పిలిచి టికెట్లు జారీ చేస్తున్నారు. దీంతో ఎవరు నమోదు చేశారో వారికే టికెట్ అందుతుండడం, ఏజెంట్లు హడావుడి లేకుండా ఆర్పీఎఫ్ సహకారంతో సజావుగా టికెట్ల జారీ ప్రక్రియ సాగుతుండడంతో ప్రయాణికులు హర్షిస్తున్నారు.

స్వచ్ఛ విశాఖలో భాగస్వాములు అవుదాం


వాకింగ్ ట్రాక్‌లో చెత్తను సేకరించిన అగనంపూడి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

అగనంపూడి: స్వచ్ఛ విశాఖలో అందరూ భాగస్వాములు కావాలని శానిటరీ సూపర్‌వైజర్ ఎం.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అగనంపూడి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ వాకింగ్ ట్రాక్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వాకింగ్‌ట్రాక్‌లో పేరుకుపోయిన చెత్త చెదారం, ప్లాస్టిక్ కవర్లు, గాజువాక సీసాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లోభాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా గాజువాక జోన్ శానిటరీ సూపర్‌వైజర్‌గా నియమితులైన కోటేశ్వరరావు, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి సహకరిస్తున్న రావి చలపతిరావులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, గవర సోమశేఖర్, వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడుగల నరసింగరావు, ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కె.వి.నాయుడు, జి.బాబూరావు, బి.శంకరరావు, సురేష్, నూకరాజు, బి.రామారావు, కె.పైడిరాజు, చిన్ని, పూర్ణ, అనిత పాల్గొన్నారు.

చుక్కలు చూపిస్తున్న సింహగిరి నక్షత్ర వనం

హైందవ సంప్రదాయం ప్రకారం జన్మనక్షత్రాలు, వాటి ప్రభావాలపై చాలా మందికి విశ్వాసం. అందుకే నక్షత్ర ప్రభావ పరిహారం కోసం ఆయా నక్షత్రాలకు చెందిన వృక్షాలు/చెట్ల చుట్టూ, వాటి శ్లోకాలు పఠిస్తూ, ప్రదక్షిణలు చేస్తే మంచిదని చెప్తుంటారు. అలాంటి వారిందరికీ వీలుగా సింహగిరిపై 27 జన్మ నక్షత్రాలకు చెందిన చెట్లతో నక్షత్ర వనాన్ని 2021లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేవస్థాన అధికారుల నిర్లక్ష్యం కారణంగా నక్షత్ర వనానికి వెళ్లాలంటేనే భక్తులకు చుక్కలు కనిపిస్తున్నాయి. తీరా అక్కడికి వెళ్లాక ఏయే నక్షత్రాల చెట్లు ఉన్నాయో.. ఏవి లేవో తెలియదు. ఉన్నా.. వాటి చుట్టూ కూడా ప్రదక్షిణలు చేయలేని దుస్థితి.



సింహగిరిపై నక్షత్రవనం

- నాడు ఎంతో ఆర్భాటంగా ప్రారంభం • నేడు నిర్వహణలేక దీనావస్థ • పట్టించుకోని దేవస్థానం అధికారులు

సింహాచలం: సింహగిరిపై ఏర్పాటు చేసిన నక్షత్ర వనం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ వనాన్ని నాలుగేళ్లకే మూలకు చేర్చారు. దేవస్థాన ఆదాయ మార్గాలపై ఆలోచించే అధికారులు.. అందుకు కాకులైన భక్తులకు తగిన సంతృప్తి, ఆనందాన్నివ్వడంలో మాత్రం అశ్రద్ధ చూపిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు నిదర్శనంగా ఇక్కడి నక్షత్ర వనంలో చెట్ల చుట్టూ పెరిగిన తుప్ప లు, విరిగిన బోర్డులు నిలుస్తున్నాయి.

అర ఎకరంలో ఏర్పాటు

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి శ్రీగోకులానికి మధ్య ఉన్న ఉన్న అర ఎకరం స్థలంలో 2021లో అప్పటి దేవదాయ శాఖ ఆదేశాల మేరకు నక్షత్ర వనం ఏర్పాటు చేశారు. 27 జన్మ నక్షత్రాలకి సంబంధించిన వృక్షాలను నాటి, పచ్చిక లాన్‌తో సుందరంగా తీర్చిదిద్దారు. ఏయే జన్మనక్షత్రం వారు ఏ వృక్షం వద్ద ప్రదక్షిణలు చేయాలో కూడా ఆయా వృక్షాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ బోర్డుల్లో నక్షత్రం, వృక్షం, అధిదేవత పేర్లు, చేయాల్సిన ప్రదక్షిణలు, పఠించాల్సిన శ్లోకం, తద్వారా చేకూరే ఫలితాన్ని తెలుగు, ఒరియా భాషల్లో పొందుపరిచారు. కొండకు వచ్చే భక్తులకు నక్షత్ర వనం గురించి తెలిసేలా వనానికి నలువైపులా పెద్దపెద్ద సూచిక బోర్డులు పెట్టారు. స్వామిని దర్శించుకున్న తర్వాత నక్షత్రవనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్లేవారు.


జ్యేష్ట నక్షత్రం పోకచెట్టు వద్ద బోర్డు పరిస్థితి


స్వామివారి నక్షత్రమైన స్వాతి నక్షత్రానికి చెందిన తెల్లమద్దిచెట్టు


ఉత్తరాబాధ్ర.. బోర్డుపై వేపచెట్టు పేరు.. వాస్తవంగా ఉన్నది వేరే చెట్టు

ప్రస్తుత పరిస్థితి దయనీయం

నక్షత్రవనంలో ప్రస్తుతం కొన్ని జన్మనక్షత్రాలకు చెందిన వృక్షాలు కనిపించవు. కొన్ని వృక్షాల వద్ద బోర్డులు లేవు. ఉన్న బోర్డుల పరిస్థితి కూడా అధ్వానం. దీంతో నక్షత్రవనంలోకి వెళ్లిన వారు తమ జన్మనక్షగ్రానికి చెందిన వృక్షం ఏమిటో? ఎక్కడ ఉందో? తెలియక ఇబ్బందులు పడుతున్నారు. బోర్డు ఉండీ... వృక్షం లేకపోవడంతో కొందరు నిరాశగా వెనుదిరుగుతున్నారు. కొన్ని వృక్షాల వద్ద తుప్పలు పెరిగి, రాళ్లు, ముళ్లు గుచ్చుకోవడంతో ప్రదక్షిణలు చేయలేకపోతున్నారు.

వనంలోకి వెళ్లే మార్గం మూసివేత

నక్షత్రవనంలోకి వెళ్లేందుకు ఉన్న మార్గాన్ని కూడా మూడు నెలల నుంచి మూసేశారు. రాజగోపురం ఎదురుగా ఉన్న మార్గంలో భక్తుల రాకపోకలను నిషేధించారు. కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద కూడా గేట్లు అడ్డంగా పెట్టేశారు. గతంలో ఆంక్షలు లేనప్పుడు రాజగోపురం ఎదురుగా ఉన్న మార్గంలో వెళ్లే భక్తులు, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు, ప్రసాదాలశాల, శ్రీగోకులం వెళ్లే భక్తులు నక్షత్రవనాన్ని సందర్శించేవారు. ఇప్పుడు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు వెళ్లలేని దుస్థితి నెలకొంది.

పూర్వవైభవం తీసుకురావాలి



నక్షత్రవనం అన్నిచోట్ల అందుబాటులో ఉండదు. అతి తక్కువగానే ఏర్పాటు చేస్తుంటారు. సింహాచలం క్షేత్రంలో నక్షత్రవనం ఉండటం స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఒక వరం. అంతటి విశిష్టమైన నక్షత్ర వనం దీనావస్థలో ఉండటం బాధాకరం. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు నక్షత్రవనాన్ని అభివృద్ధి చేసి, పూర్వ వైభవం తీసుకురావాలి.

– నారాయణరావు, అయ్యన్నపేట, విజయనగరం

అన్ని వైపుల నుంచి వెళ్లేలా..



నేను కుటుంబ సమేతంగా సింహాచలం వచ్చాను. స్వామిని దర్శించుకున్న తర్వాత నక్షత్రవనంలోకి వెళ్లేందుకు కొంత ఇబ్బందిపడ్డాను. ఏ వైపు నుంచి వెళ్లాలో తెలియని పరిస్థితి. కేవలం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి వెళ్లినవారు మాత్రమే నక్షత్ర వనంలోకి వెళ్లేందుకు వీలవుతోంది. గతంలో వలే అన్ని వైపుల నుంచీ నక్షత్రవనంలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి.

– నాయుడు, గిరివిడి


ఉత్తరాషాఢ నక్షత్రానికి చెందిన చెట్టు వద్ద ప్రదక్షిణలకు అనువుగా లేని పరిస్థితి


చెట్టు లేదు.. బోర్డు లేదు.. ఊచ మిగిలింది

గంటల తరబడి చెకింగ్‌తో ట్రాఫిక్ ఇక్కట్లు


రోడ్డుపై నిలిపిన ఎన్టీపీసీ మెటీరియల్ వాహనాలు

పరవాడ: వాడచీపురుపల్లి–పరవాడ రహదారిలో సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్ గేటు సమీపంలో తరచూ రోడ్డుపై నిలుపుతున్న మెటీరియల్ తరలించే భారీ వాహనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ముందే ఇరుకు రోడ్డు ఆపై భారీ వాహనాలను రోడ్డుపై వరుస క్రమంలో నిలిపేస్తున్నారు. ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద చెకింగ్‌లు పూర్తయితే తప్ప.. సెక్యూరిటీ సిబ్బంది వాహనాలను లోపలికి అనుమతించరు. వాహనాల చెకింగ్ గంటల తరబడి జరుగుతున్న నేపథ్యంలో అంతవరకు వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఫార్మాసిటీ, హిందూజా, ఎన్టీపీసీ పరిశ్రమల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికులు, పాఠశాలలు, కళాశాలల బస్సులు, వివిధ ప్రాంతాలకు వ్యాపార లావాదేవీలపై రాకపోకలు సాగించే వ్యాపారస్తులు, ఇతర ప్రయాణికులు నిత్యం ఇక్కట్లుపడుతున్నారు. రోడ్డు పక్కన నిలిపిన వాహనాల కారణంగా ఎదురెదురుగా భారీ వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సెక్యూరిటీ చెకింగ్ జరిగే వరకు సమీపంలోని లారీ యార్డ్‌లో వీటిని నిలపడం ద్వారా ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కవచ్చని స్థానికులు చెప్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి ఎన్టీపీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా అన్నసమారాధన

పెదగంట్యాడ: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని 77వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టు పైడిరెడ్డి అన్నారు. మరడ దాసరిపేటలోని వరసిద్ధి వినాయక ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహచనం, పంచగవ్యం, నీరాజన మంత్రపుష్పం తదితర విశేష పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బుట్టు పైడిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బుట్టు అప్పలరెడ్డి, డి. తాతారావు, డి. నాయుడు, చిన్నారావు, పి. వెంకటరెడ్డి, పిట్ట సంజీవరెడ్డి, బి. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన కన్వెన్షన్ సెంటర్‌కు ప్రారంభోత్సవం


కన్వెన్షన్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్, ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. వేపగుంట దరి చీమలాపల్లిలో రూ.8.23 కోట్ల నిధులతో నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ విశాఖ అభివృద్ధిలో వీఎంఆర్‌డీఏ కీలక పాత్ర పోషించనుందన్నారు. వీఎంఆర్‌డీఏ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ కన్వెన్షన్ నిర్మాణంతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పినగాడి–వేపగుంట రోడ్డును ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. దీంతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, అధికారులు భవానీశంకర్, మధుసూదనరావు, రామరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పటి కల ఇప్పుడు నెరవేరింది

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో చీమలాపల్లి వద్ద నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2022లోనే నిధులు మంజూరయ్యాయి. తొలుత రూ.2 కోట్లు మంజూరు కాగా, 2023లో మరో రూ.4 కోట్లు కేటాయించారు. 2024 ఎన్నికల సమయానికి దాదాపు 95 శాతం పనులు పూర్తికాగా కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన సౌకర్యాలకు రూ.కోటిన్నర వరకు వీఎంఆర్‌డీఏ నిధులు మంజూరు చేసింది. తాజాగా ఇది అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం ఈ సేవను నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

బుద్ధిగా ప్రవర్తిస్తే.. మంచి భవిష్యత్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

పెందుర్తి: రౌడీ షీటర్లు బుద్ధి మార్చుకుని, మంచిగా ప్రవర్తిస్తే వారి భవిష్యత్ బాగు చేసుకునే అవకాశం కల్పిస్తామని ఎస్‌ఐ ఎస్వీ భాస్కరరావు అన్నారు. సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. చెడు ప్రవర్తన తమతో పాటు, తమ కుటుంబాలూ నాశనమవుతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికీ వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు. పలు సూచనలు చేశారు.

డిగ్రీ కళాశాల రోడ్లకు ప్రారంభోత్సవం


కళాశాలలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్, విశ్రాంత ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీటీ రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణంతో మహర్దశ పట్టిందని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. ప్రధాన రహదారి నుంచి కళాశాల ప్రాంగణం వరకు సుమారు రూ.58 లక్షల వీఎంఆర్‌డీఏ నిధులతో చేపట్టిన ఈ రోడ్లకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పెందుర్తిలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రిన్సిపాల్, విశ్రాంత ప్రిన్సిపాళ్లు ఆవిష్కరించారు. ఈ నిర్మాణాలకు కళాశాల విద్యాశాఖ పూర్వ కమిషనర్ పోలా భాస్కరరావు వీఎంఆర్‌డీఏను సంప్రదించి స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో చేపట్టేందుకు చేసిన కృషిని వివరించారు. కళాశాలకు పూర్తిస్థాయిలో రోడ్లు ఏర్పాటు కావడం విద్యార్థులకు సౌకర్యంగా మారిందన్నారు.

మిత్రమా.. మేమున్నాం!

స్నేహితుల దినోత్సవం నాడు జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు తోటి కార్మికుడికి ఓదార్పునిచ్చారు. 98వ వార్డులో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికుడు, డప్పు కళాకారుడు ఎన్.రాజు ఆదివారం ఉదయం అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు, సీఐటీయూ ప్రతినిధులు టి.నూకరాజు, గొలగాని అప్పారావు, నాయుడు, బాలు, ఈశ్వరర్రావు, రాజు, ఆదినారాయణ, మీనాక్షి రాజును పరామర్శించి ధైర్యం చెప్పారు. తమ వంతుగా అన్ని విధాలా సహకారం అందిస్తామని భరోసానిచ్చారు.

– పెందుర్తి


జీవీఎంసీ పారిశుధ్య కార్మికుడు రాజును పరామర్శిస్తున్న తోటి కార్మికులు

భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టండి

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలో భూ ఆక్రమణలపై తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ గాజువాక పట్టణ కార్యదర్శి కె.అచ్యుతరావు డిమాండ్ చేశారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కూర్మన్నపాలెం సర్వేనెంబర్ 27లోని ఆక్రమిత భూములను ఆదివారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన గెడ్డలు, వాగులు ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేస్తుంటే రెవెన్యూ అధికారులు చేష్టలుడిగి చూడడం సమంజసంగా లేదన్నారు. అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి చర్యలు తీసుకోకుండా కట్టడాలను అలాగే వదిలేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.తక్షణమే ఆక్రమిత భూముల్లో నిర్మించిన షెడ్లు కూల్చివేయాలని డిమాండ్ చేశారు.

రహదారికి రంపపుకోత

- భారీ వాహనాల రాకపోకలతో ఛిద్రమవుతున్న గొల్లలపాలెం రోడ్డు
- రెండేళ్లకే శిథిలావస్థకు చేరుకున్న పినగాడి–సంతపాలెం మార్గం


భారీ వాహనాలు తిరగడంతో ఛిద్రమవుతున్న పినగాడి–గొరపల్లి–సంతపాలెం రోడ్డు


గొల్లలపాలెం వద్ద పూర్తిగా పాడైన రహదారి

పెందుర్తి: విశాఖ, విజయనగరంజిల్లాల్లోని దాదాపు ఇరవైకి పైగా గ్రామాలను కలుపుతున్న పినగాడి–గొరపల్లి–సంతపాలెం రహదారి రంపపుకోతకు గురవుతోంది. యథేచ్ఛగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో పునరుద్ధరించిన కొన్నాళ్లకే ఛిద్రమైంది. ఎక్కడికక్కడ రోడ్డు కోరుకుపోతోంది. భారీ గోతులు ఏర్పడుతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడితే రోడ్డు పూర్తిగా శిథిలమవడం ఖాయంగా కనిపిస్తోంది.

మూణ్నాళ్ల ముచ్చటే..

పినగాడి నుంచి కోట్నివానిపాలెం మీదుగా గొరపల్లి, గొల్లలపాలెం నుంచి సంతపాలెం వద్ద సబ్బవరం–కొత్తవలస రోడ్డుకు ఈ రహదారిని కలిపారు. 2022లో పినగాడి నుంచి గొల్లలపాలెం వరకు రోడ్డు నిర్మించారు. కొన్ని వివాదాల తర్వాత గొల్లలపాలెం నుంచి సంతపాలెం రోడ్డు వరకు మిగిలిన భాగాన్ని పూర్తి చేశారు. దీంతో ఇటు విశాఖపట్నం అటు విజయనగరం జిల్లాల శివార్లలో ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలు సులభతరం అయ్యాయి. దాదాపు 20కి పైగా గ్రామాల ప్రజలు ఈ మార్గంలో ప్రయాణం చేస్తున్నారు. 6 కిలోమీటర్లు పొడవున ఉన్న ఈ రోడ్డు ప్రస్తుతానికి గొల్లలపాలెం వరకు బాగానే ఉంది. అయితే దాదాపు రెండు కిలోమీటర్లు పరిధిలో నూతనంగా నిర్మించిన రోడ్డు పూర్తిగా పాడైంది. భారీ వాహనాల రాకపోకలతో పాటు రోడ్డు నాసిరకంగా నిర్మించడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ ప్రస్తుత కూటమి పార్టీలకు చెందినవాడే. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ వాహనాలను నియంత్రించి, రోడ్డు కోతను నివారించాలని కోరుతున్నారు.

సాగర తీరంలో సండే సందడి


తిక్కవానిపాలెంలో సందడి

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో సందడిగా మారాయి. సండే వచ్చిందంటే చాలు సుదూర ప్రాంతాల నుంచి చాలా మంది ఆటవిడుపుగా పిల్లా పాపలతో తీర ప్రాంతాలకు చేరుకుంటారు. ఈ మధ్య కాలంలో ఎండలు మండుతుండటంతో తీర ప్రాంతాల్లో సేదదీరేందుకు వచ్చేవారి సంఖ్య పెరిగింది. ఈ క్రమంలోనే ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందినవారు ఇళ్ల నుంచే ఆహార పదార్థాలు వెంట తెచ్చుకుని, తీర ప్రాంతాలకు చేరుకొన్నారు. తీరంలో ఇసుక తిన్నెలపై ఆట పాటలతో గడిపి మధ్యాహ్నం భోజనం చేసి, సాయంత్రం వరకు సముద్ర స్నానాలతో సందడి చేశారు.